

ఆరు లేన్ల రహదారి పనులను పరిశీలిస్తున్న రహదారిశాఖ ఇంజనీర్ల బృందం

16 కి.మీ భారీ ఫ్లై ఓవర్

తిరువాన్మియూర్ నుంచి ఉద్దాండి వరకు ● కేవలం 10 నిమిషాలే ప్రయాణం

పెరంబూర్, ఆగస్టు 9: స్థానిక తిరువాన్మియూర్ నుంచి ఈస్ట్‌కోస్ట్ రోడ్డులోని అక్కరై వరకు 10.5 కి.మీ మేర ఆరులేన్లుగా మార్చనున్న నేపథ్యంలో, తిరువాన్మియూర్ రైల్వేస్టేషన్ నుంచి ఉద్దాండి వరకు (16 కి.మీ మేర) రోడ్డు పైభాగంలో ఫ్లై ఓవర్ ఏర్పాటు కానుంది. ఇందుకోసం రాష్ట్ర రహదారుల శాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది.

నగరంలోని ప్రధాన రహదారుల్లో ఈసీఆర్, ఓంఆర్ రోడ్డు ఉన్నాయి. తిరువాన్మియూర్ నుంచి అక్కరై వరకు 10 కి.మీ ఉంటుంది. ఈ మార్గం 60 నుంచి 70 అడుగుల వెడల్పులో నాలుగులేన్ల రహదారిగా ఉంది. దీనిపై రోజురోజుకు ట్రాఫిక్ పెరుగుతోంది. తిరువాన్మియూర్ నుంచి ఉద్దాండి వైపుకు ప్రతిరోజూ సుమారు 1.20 లక్షల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈరోడ్డును ఆరు లేన్లుగా మార్చాలని నిర్ణయించిన రోడ్డు, రహదారుల శాఖ భూసేకరణ చేపట్టింది. భూములు ఇచ్చిన వారికి పరిహారంగా రూ.778 కోట్లు, రహదారి విస్తరణకు రూ.174.92 కోట్లను రాష్ట్రప్రభుత్వం కేటాయించింది. రహదారి విస్తరణ పనులు 2008లో ప్రారంభమయ్యాయి. భూసేకరణ రెవెన్యూ శాఖ, రోడ్డు నిర్మాణపనులను రహదారుల శాఖ చేపట్టాయి. ఈ పనులు ప్రారంభమై 16 ఏళ్లు పూర్తయింది. ఈ పనుల వేగవంతం చేసినట్లయితే ప్రస్తుతం ఆరులేన్ల రహదారి అందుబాటులోకి వచ్చేది. ప్రభుత్వం నిధులు కేటాయించినా, భూసేకరణ బృందంలోని తహసీల్దార్లు, సర్వేయర్లు సక్రమంగా పనిచేయకపోవడం, భూములకు పరిహారం చెల్లించడంలో జాప్యం తదితర కారణాలతో రహదారి నిర్మాణపనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రస్తుతం, ఏడాది కాలంగా పనులు వేగవంతం చేశారు. మొత్తంగా 10.5 కి.మీ మేర ఆక్రమణలు, పట్టా, పోరంబోకు భూములున్నాయి. రెవెన్యూ గ్రామాల వారీగా పట్టాదారులకు 95 శాతం పరిహారం చెల్లించగా, కట్టడాలు కూల్చివేసిన ప్రాంతాల్లో రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి.


ఫ్లై ఓవర్ నిర్మాణం...

ఈ నేపథ్యంలో, రహదారి పైభాగంలో ఫ్లైఓవర్ నిర్మించాలని రహదారుల శాఖ నిర్ణయించింది. ఇప్పటికే, టైడల్ పార్క్ జంక్షన్ సమీపం, ఎల్బీ రోడ్డు నుంచి కొట్టివాక్కం వరకు రూ.300 కోట్లతో 22 కి.మీ మేర ఫ్లై ఓవర్ నిర్మించాలని గతంలో నిర్ణయించారు. ప్రస్తుతం, ఈ ఫ్లైఓవర్ తిరువాన్మియూర్ రైల్వేస్టేషన్ నుంచి ఈసీఆర్ ఉద్దాండి చెక్‌పోస్ట్ వరకు 16 కి.మీ వరకు చేపట్టాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రాజెక్ట్ రూపొందించేందుకు రూ.52 లక్షలు కేటాయించింది.

అక్కరైలో రౌండ్ తానా...

ఈస్ట్ కోస్ట్ రోడ్డులో ప్రస్తుతం 70 అడుగుల వెడల్పున నాలుగు రోడ్ల రహదారి ఉంది. విస్తరణ అనంతరం, 104 అడుగుల వెడల్పున ఆరు రోడ్లగా మారనుంది. అందులో 90 అడుగుల వెడల్పుతో తారు రోడ్డు, 4 అడుగుల వెడల్పుతో సెంట్రల్ బ్లాక్, ఇరువైపులా 5 అడుగులు, 10 అడుగుల వెడల్పుతో వర్షపు నీటి కాలువలు, ఫుట్ పాత్ ఏర్పాటుచేస్తున్నారు. తిరువాన్మియూర్ రైల్వేస్టేషన్ నుంచి ఉద్దాండి వరకు ఫ్లై ఓవర్ ప్రాజెక్ట్ చేపట్టనున్న నేపథ్యంలో, ఆరు రోడ్ల రహదారి పనులు వేగవంత చేశారు. రహదారుల శాఖ ప్రధాన ఇంజనీర్ జవహర్ ముత్తురాజ్, పర్యవేక్షణ ఇంజనీర్ భాస్కరన్, డివిజనల్ ఇంజనీర్ రాజగణపతితో కూడిన అధికారుల బృందం గురువారం ఈసీఆర్‌ను పరిశీలించింది. తిరువాన్మియూర్, అక్కరై, పాలవాక్కం ప్రాంతాల్లో భూసేకరణ పనులు, రహదారి విస్తరణ పనులు, ఈ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాల మరో ప్రాంతానికి తరలింపు తదితర వివరాలు తెలుసుకున్న ఈ బృందం, రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించింది. ఈస్ట్ కోస్ట్ రోడ్డు నుంచి అక్కరై జంక్షన్ నుంచి షోలింగనల్లూర్ వెళ్లేలా కేకే రోడ్డు జంక్షన్ ఉంది. ఫ్లై ఓవర్ ఏర్పాటయితే, అక్కరై జంక్షన్ రౌండ్ తానాగా మారి, కేకే రోడ్డు అనుసంధానం చేసేలా ఫ్లై ఓవర్ ఏర్పాటుకానుంది. అందువల్ల ఈసీఆర్ నుంచి ఓఎంఆర్ అనే పాత మహాబలిపురం రోడ్డు సులభంగా చేరుకోవచ్చు.

ఫ్లై ఓవర్ నిర్మాణానికి ముందే, తిరువాన్మియూర్ నుంచి అక్కరై వరకు ఆరు లేన్ల రహదారి పనులు వేగవంతం చేయాలని నిర్ణయించారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే ఈసీఆర్‌లో ట్రాఫిక్ సమస్య కొంత తగ్గుతుందని రహదారుల శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ విషయమై వారు మాట్లాడుతూ... పరిహారం చెల్లింపు, కాలువలు నిర్మించి రహదారి విస్తరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. తిరువాన్మియూర్, నీలాంగరై ప్రాంతాల్లో విస్తరణ చేపట్టాల్సి ఉందన్నారు. ఫ్లై ఓవర్ నిర్మాణానికి సంబంధించి ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారీ చేపట్టాలని, ప్రస్తుతం తిరువాన్మియూర్ నుంచి ఉద్దాండి వరకు వెళ్లేందుకు 45 నిమిషాలు పడుతుందని, ప్రాజెక్ట్ పూర్తయితే కేవలం పది నిమిషాల్లో వెళ్లొచ్చని అధికారులు తెలిపారు.



ఫ్లై ఓవర్ నమూనా

స్టాలిన్ తలచుకుంటే డిప్యూటీగా ఉదయనిధి

● ఆర్.ఎస్.భారతి నర్మగర్భ వ్యాఖ్యలు



అడయార్, ఆగస్టు 9: ముఖ్యమంత్రి స్టాలిన్ మనసు పెడితే ఉదయనిధి ఉప ముఖ్యమంత్రి అవుతారని డీఎంకే సీనియర్ నేత, కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్ఎస్ భారతి నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. ప్రస్తుత డీఎంకే ప్రభుత్వ పాలనలో ఉప ముఖ్యమంత్రిగా ఉదయనిధిని నియమించాలంటూ ఆ పార్టీకి చెందిన అనేక మంది నేతలు స్టాలిన్‌ను కోరుతున్న విషయం తెలిసిందే. అయితే ఉదయనిధిని డిప్యూటీ సీఎం చేయాలని సిఫార్సులు వచ్చిన మాట నిజమేనని, కానీ, అవి ఫలించలేదని స్టాలిన్ తన మనసులో మాట చెప్పకనే చెప్పేశారు. ఈ నేపథ్యంలో పార్టీ సీనియర్ నేతల్లో ఒకరైన ఆర్ఎస్ భారతి ఈ అంశంపై స్పందిస్తూ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉదయనిధిని నియమించడానికి పలువురు సీనియర్లు వ్యతిరేకిస్తున్నారన్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదన్నారు. తనలాంటి సీనియర్లే ఉదయనిధిని డిప్యూటీ సీఎం చేయాలని కోరుతున్నామన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ మనసుపెడితే ఉదయనిధి స్టాలిన్ ఉప ముఖ్యమంత్రి కావడం పెద్ద విషయం కాదన్నారు. సినీ హీరో విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం పార్టీ మహానాడుకు తిరుచ్చిలో స్థలం ఇవ్వకుండా డీఎంకే సీనియర్ నేత కేఎన్ నెహ్రూ అడ్డుపడుతున్నారంటూ సాగుతున్న ప్రచారం సరికాదన్నారు. డీఎంకే ఏ ఒక్కరికీ భయపడదన్నారు. ఎంజీఆర్, జయలలిత వంటి వారికే భయపడలేదని, ఇపుడు విజయ్ పార్టీని చూసి భయపడతామా అని ప్రశ్నించారు. తమ దారిలో మేం వెళుతున్నామని ఆర్ఎస్ భారతి వ్యాఖ్యానించారు.

విజయమే లక్ష్యం

విద్యార్థులకు సీఎం స్టాలిన్ దిశానిర్దేశం

● ఉన్నత విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం
● కోవైలో 'తమిళ్ పుదల్వన్' పథకం ప్రారంభం



పథకాన్ని ప్రారంభిస్తున్న సీఎం

చెన్నై, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జీవితంలో ఎదురయ్యే అడ్డంకులకు కుంగిపోకుండా విజయమే లక్ష్యంగా విద్యార్థులు ముందుకు సాగాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. అలాగే, ప్రతి విద్యార్థికి ఉన్నత విద్య అందించడమే తమ లక్ష్యమని ప్రకటించారు. తమ ముందున్న ప్రతిబంధకాలను తెంచుకుని విద్యార్థులు చదువుల్లో రాణించాలని హితవు పలికారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.వెయ్యి పథకాన్ని శుక్రవారం కోయంబత్తూరులో సీఎం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ.. ఈ పథకం ప్రారంభానికి ముందే విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని అధికారులను ఆదేశించానని, బ్యాంకు ఖాతాల్లో రూ.1000 జమ అయిందా అని విద్యార్థులను ప్రశ్నించారు. దీంతో సభలో వున్నవారంతా జమ అయిందంటూ చెప్పారు. ప్రజా సంక్షేమం కోసం ప్రతి రోజూ ఏదో ఒక పథకాన్ని ప్రవేశపెడుతున్నప్పటికీ ఒకటీరెండు పథకాలు మాత్రమే సంతృప్తినిస్తాయన్నారు. అలా తృప్తినిచ్చినది తమిళ్ పుదల్వన్ పథకమన్నారు. ఈ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు లబ్ది పొందుతారన్నారు. మూడేళ్ళలో తన సారథ్యంలోని డీఎంకే ప్రభుత్వ ద్రావిడ పాలన అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా ఉందని చెప్పుకునేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. మహిళల కోసం అమలు చేస్తున్న విడియల్ అనే పథకం కింద 519 కోట్ల మంది మహిళా ప్రయాణికులు ఇప్పటివరకు లబ్ధి పొందారన్నారు. కలైంజర్ మహిళా సాధికార నగదు పంపిణీ పథకం కింద 1.15 కోట్ల మంది విద్యార్థులకు నెలకు రూ.1000 చొప్పున ఆర్థిక సాయం అందుతుందన్నారు. పుదమైపెణ్ పథకం కింద విద్యార్థినులు లబ్ధి పొందుతున్నారన్నారు. ఇపుడు ప్రవేశపెట్టిన తమిళ్ పుదల్వన్ పథకం విద్యార్థుల అంతరంగాన్ని గ్రహించి అమలు చేస్తున్నామన్నారు. ఉన్నత విద్యలో చేరేందుకు పేద, మధ్యతరగతి విద్యార్థులను ప్రోత్సహించేలా ఈ పథకం అమలు చేస్తున్నామన్నారు. ఈపథకం కింద ఆరు నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 3.28 లక్షల మంది విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున నెలవారీగా ఆర్థిక సాయం అందుతుందన్నారు. పేదరికం లేని సమానత్వం, విజ్ఞాన తమిళ సమాజాన్ని రూపొందించాలన్నారు. ప్రపంచంలోనే తమిళనాడు ఆదర్శ రాష్ట్రంగా ఉండాలన్నారు. పారిస్ ఒలింపిక్స్ పోటీల్లో పాల్గొన్న వినేశ్ ఫొగాట్ తన జీవితంలో ఎన్నో అడ్డంకులను ఎదుర్కొన్నారనే విషయం మీకందరికీ తెలుసని, అయినప్పటికీ ఏమాత్రం వెనుకంజ వేయకుండా, ధైర్యసాహసాలతో పాటు కృషి, పట్టుదలతో పోరాటం చేసి నేడు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఒక్క విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. జీవితంలో ఎదురయ్యే అడ్డంకులను చూసి కుంగిపోరాదన్నారు. విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని సీఎం స్టాలిన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్ముడి, ఏవీ వేలు, ముత్తుస్వామి, అన్బిల్ మహేశ్, గీతా జీవన్, ఎంపీ గణపతి రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, కలెక్టర్ క్రాంతికుమార్, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా, ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం స్టాలిన్ శుక్రవారం ఉదయం చెన్నై నుంచి కోవై వెళ్ళారు. ఆ తర్వాత జిల్లాలో పూర్తి చేసిన అనేక అభివృద్ధి పనులను ప్రారంభించి కొత్తగా చేపట్టే నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.



తమ బ్యాంకు ఖాతాలో నగదు జమ అయిందంటూ మొబైల్ మెసేజ్‌లు చూపుతున్న విద్యార్థులు

వచ్చే నెల రాష్ట్రానికి ప్రధాని

● రెండు వందే భారత్ రైళ్లు ప్రారంభం
● అదే రోజు రామేశ్వరం వంతెన కూడా



చెన్నై, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వచ్చే నెల రాష్ట్రానికి రానున్నారు. రాష్ట్రంలో తిరిగే రెండు వందే భారత్ రైళ్లతో పాటు రామేశ్వరం - పాంబన్ వంతెనను కూడా ఆయన ప్రారంభించనున్నారు. అయితే ప్రధాన పర్యటన అధికారికంగా ఖరారు కావాల్సి వుంది. చెన్నై - నాగర్‌కోయిల్, మదురై-బెంగళూరు మధ్య కొత్తగా వందేభారత్ రైళ్లను నడపాలని దక్షిణ రైల్వే నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన తుది విడత పనులు కూడా పూర్తయ్యాయి. నిజానికి జూన్‌లోనే ఈ రెండు రైళ్లను ప్రధాని ప్రారంభించాల్సివుంది. కానీ కోల్‌కతలో సంభవించిన ఘోర రైలు ప్రమాదం, చెన్నై - తాంబరం - మదురై మార్గంలో రైల్వే పనుల్లో జాప్యం కారణంగా ఆ రెండు సర్వీసులు ప్రారంభం కాలేకపోయాయి. అయితే ఇప్పుడు అన్నీ సద్దుమణగడంతో ఈ రెండు రైళ్లను నడపాలని దక్షిణరైల్వే నిర్ణయించింది. దీంతో పాటు మరో 8 మార్గాల్లోనూ వందేభారత్ సేవలు అందనున్నాయి. ఐసీఎఫ్‌లో ఇప్పటికే 70 వందేభారత్ రైళ్లు సిద్ధమవ్వగా, ఇందులో 51 రైళ్లు పరుగులు పెడుతున్నాయి. 9 రైళ్లను అత్యవసర సేవలకు వుంచగా, మరో 10 వందే భారత్ రైళ్లు పట్టాలెక్కేందుకు ఎదురు చూస్తున్నాయి. అందులో రెండు రైళ్లు వచ్చే నెల చెన్నై - నాగర్‌కోయిల్, మదురై - బెంగళూరు మధ్య పరుగులు పెట్టనున్నాయి. వాటిని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వచ్చే నెలలో ప్రారంభించనున్నట్లు రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు. పాంబన్-రామేశ్వరం మార్గంలో వంతెన పనులు పూర్తి కావచ్చాయి. దానిని కూడా సెప్టెంబరులో ప్రారంభించేందుకు దక్షిణరైల్వే సన్నాహాలు చేస్తోంది. వందేభారత్ రైళ్లను, పాంబన్ వంతెనను కూడా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రారంభిస్తారని రైల్వే అధికారులు తెలిపారు. అయితే ఏ వేదిక నుంచి వాటిని ప్రారంభిస్తారన్నది ఇంకా ఖరారు కాలేదని వారు పేర్కొన్నారు.



మద్రాస్ యూనివర్సిటీ

మద్రాస్ వర్సిటీకి వీసీ నియామకం ఎప్పుడో?

● డిగ్రీల కోసం విద్యార్థుల ఎదురు చూపులు

చెన్నై, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మద్రాస్ యూనివర్సిటీ ఏడాదిగా వైస్‌ఛాన్స్‌లర్ కోసం ఎదురు చూస్తోంది. రాష్ట్ర గవర్నర్‌కు, ప్రభుత్వానికి మధ్య నెలకొన్న ప్రచ్ఛన్న యుద్ధం కారణంగా వీసీ నియామకంలో స్తంభన ఏర్పడింది. ఈ వ్యవహారం కోర్టులో నలుగుతుండడంతో దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. అయితే వీసీ లేకపోవడంతో డిగ్రీల మంజూరులో జాప్యం కొనసాగుతోంది. ఈ కారణంగా 55 వేల మంది విద్యార్థులు డిగ్రీల కోసం ఎదురు చూస్తున్నారు. ఉన్నత చదువులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు అవసవరమతుండడంతో ఏం చేయలేని పరిస్థితిలో వారు తీవ్రంగా నష్టపోతున్నారు. వీసీ నియామకం అయితేగానీ స్నాతకోత్సవం జరగదు. అప్పుడే విద్యార్థులకు డిగ్రీలు అందుతాయి. కానీ ఇప్పట్లో అది జరిగే సూచన కూడా కనిపించడం లేదు. వీసీ లేనందువల్ల హయ్యర్ ఎడ్యుకేషన్ కార్యదర్శి ప్రదీప్ యాదవ్ నేతృత్వంలో ముగ్గురితో కూడిన బృందం యూనివర్సిటీని నిర్వహిస్తోంది. ఈ కమిటీ తీసుకునే చర్యల కారణంగా యూనివర్సిటీలో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. తక్షణమే యూనివర్శిటీకి వీసీని నియమించి, తమకు నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని విద్యార్థులు వాపోతున్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న సీఆర్పీఎఫ్ బలగాలు

విమానాశ్రయంలో ఏడంచెల భద్రత

● అడుగడుగునా తనిఖీలు
● అదుపులోకి అనుమానితులు



ప్యారీస్, ఆగస్టు 9: భారత 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చెన్నై విమానాశ్రయంలో శుక్రవారం నుంచి ఏడంచెల భద్రత ఏర్పాటు చేశారు. దీని కారణంగా స్వదేశీ ప్రయాణికులు గంటన్నర ముందు, అంతర్జాతీయ విమాన ప్రయాణికులు మూడున్నర గంటల ముందుగా విమానాశ్రయానికి చేరుకోవాలని అధికారులు సూచించారు. త్రిశూలం నుంచి మీనంబాక్కం వరకు ఉన్న స్వదేశీ, అంతర్జాతీయ విమానాశ్రయాలు, కార్గో, విమానాలకు ఇంధనం నింపే ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్ బృందాలు విధుల్లో పాల్గొంటున్నారు. ఈ నెల 15న జరిగే దేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడులను భగ్నం చేసేలా ఉగ్రదాడి జరిగే అవకాశముందని కేంద్ర హోంశాఖకు రహస్య సమాచారం అందింది. దీంతో దేశవ్యాప్తంగా విమానాశ్రయాలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ప్రజలు అధికంగ తిరిగే ప్రాంతాలు, ఆలయాలు, చర్చిలు, మసీదుల వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు. ఈ నేపథ్యంలో, చెన్నై విమానాశ్రయంలో శుక్రవారం నుంచి ఏడంచెల భద్రత ఏర్పాటుచేశారు. గడిచిన రెండు నెలల కాలంలో చెన్నై విమానాశ్రయానికి పదిసార్లు బాంబు బెదిరింపు రావడంతో ఇప్పటికే ఈ ప్రాంతంలో ఐదంచెల భద్రత కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏడంచెల భద్రత ఏర్పాటుచేశారు. విమానాశ్రయం బయట స్థానిక పోలీసులు, లోపల కేంద్ర పారిశ్రామిక బలగాలు గస్తీ చేపట్టాయి. విమానాశ్రయానికి వచ్చే వాహనాలను ప్రవేశ ద్వారం వద్దే ఆపి భద్రతా దళాలు తనిఖీ చేసిన తరువాతే లోపలికి పంపిస్తున్నారు. ప్రయాణికుల లగేజీని మెటల్ డిటెక్టర్లతో పరిశీలిస్తున్నారు. విమానాశ్రయ భద్రత దృష్ట్యా సందర్శకుల ప్రవేశంపై ఇప్పటికే నిషేధం విధించారు. కానీ, ప్రముఖులు వచ్చిన సమయంలో వారికి ఆహ్వానం పలికేందుకు కార్యకర్తలు పెద్దసంఖ్యలో వస్తుంటారు. వారికి కూడా ప్రస్తుతం కొన్ని నిబంధనలు విధించారు. విమానాశ్రయ ప్రాంగణం, పరిసరాల్లో ఇప్పటికే సీసీ కెమెరాలుండగా, అదనపు కెమెరాలు ఏర్పాటుచేసి కంట్రోల్ రూమ్ నుంచి 24 గంటలు పర్యవేక్షిస్తున్నారు. ఈ తనిఖీలు ఈ నెల 20వ తేది వరకు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.



సమాచార ధ్వని

25న 'తెనాలి రామకృష్ణుడి కవితా వైభవం'

చెన్నై, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాస ధారావాహిక కార్యక్రమం ఈ నెల 25న జరుగనుంది. టి.నగర్ విజయరాఘవరోడ్డులో వున్న ఆంధ్రాక్లబ్‌లో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు వరంగల్‌కు చెందిన 'సహృదయ' సాహిత్య, సాంస్కృతిక సంస్థ గన్నమరాజు గిరిజా మనోహరబాబు 'తెనాలి రామకృష్ణుడి కవితా వైభవం' అనే అంశంపై ఉపన్యసించనున్నారు. ఈ కార్యక్రమానికి సాహితీ ప్రియులందరూ ఆహ్వానితులేనని సంస్థ అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్థికసాయానికి దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఆగస్టు 9: కేంద్ర ప్రభుత్వ ఆర్థికసాయానికి విద్యార్థులు సెప్టెంబరు 5వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలి. పోస్టల్ స్టాంప్ సేకరణలో ఆసక్తి కలిగిన ఉన్నత పాఠశాల విద్యార్థులకు నెలకు రూ.500 చొప్పున ఏడాదికి రూ.6,000లను కేంద్ర ప్రభుత్వం అందజేస్తోంది. దేశవ్యాప్తంగా 920 మందిని ఎంపిక చేస్తుండగా, రాష్ట్రంలో 40 మందిని ఎంపిక చేస్తున్నారు. ఆర్థిక సాయం పొందేందుకు జనరల్ నాలెడ్జ్, ప్రాజెక్ట్ రెండు విధాలైన పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలకు www.tamilnadupost.cept.gov.in అనే వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని పూర్తిచేసి సెప్టెంబరు 5వ తేదిలోపు పంపించాలి. ఇతర వివరాలకు 044-28543199 నెంబరు సంప్రదించవచ్చు.

15 వరకు ఊటీ కొండ రైలు రద్దు

పెరంబూర్, ఆగస్టు 9: మేట్టుపాళయం నుంచి ఊటీకి వెళ్లే కొండ రైలు సేవలు శుక్రవారం నుంచి 15వ తేది వరకు రద్దయ్యాయి. కల్లారు నుంచి హిల్‌గ్రోవ్ వరకు రైలు మార్గంలో మరమ్మతుల కారణంగా కొండ రైలు సేవలు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

మాధవరంలో 'టెక్నికల్ పార్క్'

ఐసిఎఫ్, ఆగస్టు 9: స్థానిక మాధవరంలో 150 ఎకరాల్లో టెక్నికల్ పార్క్ ఏర్పాటుకానుంది. చెన్నై, కోయంబత్తూర్, హోసూరు ప్రాంతాల్లో టెక్ సిటీ పేరిట వాణిజ్య, సాంకేతిక నగరాలు ఏర్పాటుచేయనున్నట్లు గత ఏడాది మార్చిలో ముఖ్యమంత్రి ప్రకటించారు. ఆ ప్రకారం, నగరంలో టెక్ సిటీ ఏర్పాటు పనులను టిడ్కో చేపట్టింది. అభివృద్ధిలో వెనుకబడిన ఉత్తర చెన్నైలో వీటిని ఏర్పాటు చేసి ఆ ప్రాంతవాసులకు ఉపాధి కల్పించనుంది. ఈ నేపథ్యంలో, మాధవరంలో 150 ఎకరాలను టిడ్కో ఎంపిక చేసింది. మాస్టర్ ప్లాన్ తయారవగానే నిర్మాణాలు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

14న గ్రూప్-2ఏ సర్టిఫికెట్ల పరిశీలన

ఐసిఎఫ్, ఆగస్టు 9: గ్రూప్-2ఏ పోస్టులకు ఈ నెల 14వ తేదీ మూడో విడత సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్ జరుగనుందని టీఎన్‌పీఎస్సీ కార్యదర్శి గోపాలసుందరరాజ్ తెలిపారు. ఈ పోస్టుల భర్తీకి రాతపరీక్ష గత ఏడాది ఫిబ్రవరి 20వ తేదీ జరిగింది. ఇంటర్వ్యూ లేని పోస్టులకు మూడో విడత సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్ బ్రాడ్‌వేలో ఉన్న టీఎన్‌పీఎస్సీ కార్యాలయంలో 14వ తేదీ జరుగనుంది. ఒరిజినల్ సర్టిఫికెట్లు, నకళ్లతో అభ్యర్థులు హాజరుకావాలని, ఇతర వివరాలకు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్ సంప్రదించాలని గోపాలసుందరరాజ్ వెల్లడించారు.

13న టెండరు ప్రక్రియపై శిక్షణ

ఐసిఎఫ్, ఆగస్టు 9: ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు టెండరు ప్రక్రియపై శిక్షణ కార్యక్రమం ఈ నెల 13వ తేదీ జరుగనుంది. రాష్ట్రప్రభుత్వ పారిశ్రామికాభివృద్ధి సంస్థ నగరంలో ఉన్న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల అభివృద్ధి సంస్థ ప్రాంగణంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు శిక్షణ ఇవ్వనుంది. వివరాలకు 9677152265, 7010143022 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

12 మండలాల్లో పెరిగిన భూగర్భ జలాలు

ఐసిఎఫ్, ఆగస్టు 9: నగరంలోని 12 మండలాల్లో 3 అడుగుల వరకు భూగర్భ జలమట్టాలు పెరిగాయి. భూగర్భ జలమట్టాల గణనకు 200 వార్డుల్లో పరికరాలు ఏర్పాటుచేశారు. 2021 కన్నా 2022లో 25 శాతం వర్షపాతం తక్కువగా నమోదైంది. 2022లో నైరుతి రుతుపవన వర్షాలు 44 సెం.మీ, 2023లో 78 సెం.మీ కురిశాయి. ఈశాన్య రుతుపవన వర్షాలు 2022లో 92 సెం.మీ, 2023లో 18 శాతం అదనంగా 109 సెం.మీ కురిశాయి. ఈ ఏడాది వేసవి నుంచే వర్షాలు తరచుగా కురుస్తున్నాయి. దీంతో, మే,జూన్,జూలైలో భూగర్భ జలమట్టాలు పెరిగాయి. ముఖ్యంగా జూలైలో తండయార్‌పేట, రాయపురం, అడయార్ మండలాలు మినహా ఇతర మండలాల్లో మూడడుగుల మేర భూగర్భ జలమట్టాలు పెరిగాయని అధికారులు తెలిపారు.

కోవైలో అంతర్జాయ స్టేడియానికి టెండర్ల ఆహ్వానం

పెరంబూర్, ఆగస్టు 9: కోయంబత్తూర్‌లో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం చేసేందుకు రాష్ట్రప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. రాష్ట్ర క్రీడాభివృద్ధి కమిషన్ వివరణాత్మక ప్రాజెక్ట్ రిపోర్టు తయారీకి టెండర్లు విడుదల చేసింది. కోవైలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. కోవై ఒండిపుదూర్, ఎల్ అండ్ టీ హైవే, భారతీయార్ విశ్వవిద్యాలయం సమీపంలోని ప్రాంతం, జైలు మైదానం ఇలా నాలుగు ప్రాంతాలను అధికారులు పరిశీలిస్తున్నారు. కాగా, ఇటీవల ఒండిపుదూర్‌లో క్రికెట్ మైదానం ఏర్పాటు సాధ్యాసాధ్యాలను క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి పరిశీలించిన విషయం తెలిసిందే.

మహిళాభివృద్ధి కోసమే వక్ఫ్ బోర్డు చట్ట సవరణ

జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ



ప్యారీస్, ఆగస్టు 9: మహిళల అభివృద్ధి కోసమే కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టిందని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు, సినీ నటి ఖుష్బూ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముస్లింలు తరతరాల నుంచి మతం పేరుతో ఆచరిస్తున్న 'ముత్తలాక్' పేరుతో మహిళలను బానిసలుగా చూశారని, ఏ వర్గంలో అయినా మహిళలు అభివృద్ధి చెందితేనే సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ముత్తలాక్ చట్టాన్ని నిషేధించి, ముస్లిం మహిళలకు స్వేచ్ఛ కల్పించడంతో పాటు ఆస్తులపై సమాన హక్కు కూడా వర్తింపజేశారని తెలిపారు. ప్రస్తుతం పార్లమెంటులో గురువారం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు కూడా ముస్లిం మతపెద్దలతో చర్చించిన తర్వాతే తీసుకొచ్చారని, అయితే ఈ బిల్లును ప్రతిపక్షాలు రాజకీయంగా పరిగణిస్తూ వ్యతిరేకించడం సరి కాదని ఖుష్బూ పేర్కొన్నారు.

వీఐటీ వర్సిటీలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

వేలూరు, ఆగస్టు 9: తమిళనాడు వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేలూరు వీఐటీ యూనివర్సిటీలో శుక్రవారం వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించిన ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన 300 మంది బాలికలు, 350 మంది బాలురు పాల్గొంటున్నారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి వర్సిటీ వైస్ ఛాన్సలర్, వేలూరు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.జీవీ సెల్వం అధ్యక్షత వహించగా, వేలూరు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ వ్యవస్థాపకులు, వర్సిటీ ఛాన్సలర్ డా.కె.విశ్వనాథన్ ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ... వేలూరు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ 60 ఏళ్లు పూర్తిచేసుకుందన్నారు. ఒక్క వ్యక్తి దేశానికే గర్వకారణమైతే జిల్లాకు చెందిన సతీష్ శివలింగం అందుకు ఉదాహరణ అన్నారు. చదువుకు ఎంత ప్రాధాన్యత ఇస్తామో క్రీడలకు అంతే ప్రాధాన్యత ఇవ్వాలని, ఆరోగ్యంగా ఉంటే ఎన్నో సాధించవచ్చన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ఒలింపిక్స్‌లో భారత్ అగ్రస్థానంలో నిలిచేలా క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ ఇవ్వాలని ఛాన్సలర్ విశ్వనాథన్ విజ్ఞప్తి చేశారు.



వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభిస్తున్న వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్, వైస్ ఛాన్సలర్ జీవీ సెల్వం తదితరులు

త్వరలో 70,000 గృహాలకు పట్టాలు

ఐసిఎఫ్, ఆగస్టు 9: స్థానిక సైదాపేట పరిధిలో 70,000 గృహాలకు పట్టాల పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఫామ్, డిడీర్ నగర్, అబ్దుల్ రజాక్ వీధి, నెహ్రూ నగర్, కన్నికాపురం, కలికుండ్రం, కోట్టూరుపురం ఎల్లయమ్మన్ ఆలయం తదితర ప్రాంతాల్లోని ప్రజలకు ఇళ్ల పట్టాలు అందజేయనున్నారు. ఈ ప్రాంతాలను గురువారం మంత్రి ఎం.సుబ్రమణ్యం, కలెక్టర్ పర్యటించి, పట్టాలు లేని వారి వివరాలు తెలుసుకన్నారు. సుమారు వందేళ్లకు పైగా నివసిస్తున్న వారికి 1973లో తాత్కాలిక పట్టాలు అందజేశారు. ప్రస్తుతం శాశ్వత పట్టాలు 70,000 నుంచి 80,000 మందికి అందించనున్నట్లు మంత్రి తెలిపారు.

విపత్తులు ఎదుర్కోవడంపై విద్యార్థులకు అవగాహన



భవనంపై చిక్కుకున్న వారిని రక్షించేలా మాక్ డ్రిల్

పెరంబూర్, ఆగస్టు 9: విపత్తుల సమయంలో సురక్షితంగా బయటపడేందుకు చేపట్టాల్సి చర్యలపై విద్యార్థులకు విపత్తుల నిర్వహణ బృందం అవగాహన కల్పించింది. నైరుతి రుతుపవనాల కారణంగా నీలగిరి జిల్లాల్లో కొద్దిరోజులుగా భారీవర్షాలు కురుస్తున్నాయి. వర్షాల కారణంగా ఊటీ, కుంద, గూడలూరు, పందలూరు తదితర తాలూకాల్లో మట్టిచెరియలు విరిగిపడడం, చెట్లు కూలడం వంటి ఘటనలు సంభవిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా వర్షాలకు 100 ఇళ్లు ధ్వంసమయ్యాయి. జాతీయ విపత్తుల నివారణ బృంద సభ్యులు జిల్లాలోనే మకాం వేసి బాధిత ప్రాంతాల్లో నివారణ చర్యలు చేపడుతున్నారు. నివారణ చర్యల్లో భాగంగా ఊటీలోని రెక్స్ పాఠశాల విద్యార్థులకు విపత్తులు ఎదుర్కోవడంపై మాక్ డ్రిల్ చేసి చూపించారు. ఈదురుగాలులు, భారీవర్షాలు, వరదల్లో సురక్షితంగా బయటపడడం, భవనాల్లో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలి తదితరాలను విద్యార్థులకు చేసి చూపించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీ బల్వా, జాతీయ విపత్తుల నివారణ బృందం డిప్యూటీ కమాండెంట్ శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణలపై కలెక్టర్‌కు నోటీసులు

ఐసిఎఫ్, ఆగస్టు 9: హైకోర్టు ఉత్తర్వులు జారీచేసినా చిట్లపాక్కం జలాశయాల ఆక్రమణలను మూడేళ్లుగా తొలగించకపోవడంపై వివరణ కోరుతూ జలవనరుల శాఖ, కాలుష్య నియంత్రణ బోర్డు, కాంచీపురం కలెక్టర్, రాష్ట్ర చిత్తడి భూముల కమిషన్‌లకు దక్షిణ మండల గ్రీన్ ట్రిబ్యునల్ నోటీసులు జారీచేసింది. తాంబరం కార్పొరేషన్ చిట్లపాక్కంలో జలవనరుల శాఖకు చెందిన 102 ఎకరాల జలాశయం ఆక్రమణలకు గురైంది. వాటిని తొలగించాలని మూడేళ్ల క్రితం మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు ఎందుకు ఆక్రమణలు తొలగించలేదంటూ జిల్లా కలెక్టర్, అధికారుల సంజాయిషీ కోరుతూ దక్షిణ మండల గ్రీన్ ట్రిబ్యులన్ నోటీసులు పంపింది.

వీసీల నియామకంలో గవర్నర్ నిర్లక్ష్యం

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై

ప్యారీస్, ఆగస్టు 9: వైస్ ఛాన్సలర్ల నియామకంలో రాష్ట్ర గవర్నర్ నిర్లక్ష్యం చూపడం ఖండించదగ్గదని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై పేర్కొన్నారు. ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో... పదేళ్ల బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వంలో ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల హక్కులు కాలరాసేలా గవర్నర్లు వ్యవహరిస్తున్నారని, ముఖ్యంగా తమిళనాడు, కేరళ, వెస్ట్ బెంగాల్, కర్ణాటక, ఢిల్లీ తదితర రాష్ట్రాల గవర్నర్లు రాజ్యాంగానికి విరుద్ధంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. మద్రాసు విశ్వవిద్యాలయానికి ఏడాదిన్నరగా వీసీని నియమించకుండా గవర్నర్ వ్యవహరించడం వల్ల 55 వేల మందికి పైగా పట్టభద్రులు గత ఏడాది ఏప్రిల్‌లో కోర్సులు పూర్తయినా డిగ్రీ పొందలేని పరిస్థితి నెలకొందని సెల్వపెరుందగై వ్యాఖ్యానించారు.

ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసును సీబీఐకి అప్పగించాలి

● బీఎస్పీ డిమాండ్

ప్యారీస్, ఆగస్టు 9: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసు సీబీఐకి బదిలీ చేయాల్సిందిగా ఆ పార్టీ నూతన అధ్యక్షుడు డా.పి.ఆనందన్ డిమాండ్ చేశారు. నుంగంబాక్కం వళ్లువర్‌కోట్టం సమీపంలో శుక్రవారం బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో పార్టీ నిర్వాహకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో పోలీసుల విచారణ వల్ల అసలైన హంతకుల వివరాలు తెలియవని, అందువల్ల ఈ కేసు వెంటనే సీబీఐకి బదిలీ చేయాలని ఆనందన్ కోరారు. ఆమ్‌స్ట్రాంగ్ స్మారక చిహ్నంగా 5 ఎకరాల్లో మణి మండపం ఏర్పాటుచేయాలని, పార్టీ రాష్ట్ర ఆర్గనైజర్ పొరుక్కొడి ఆమ్‌స్ట్రాంగ్, కుటుంబ సభ్యులకు పోలీసుల భద్రత పెంచాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో కేఎస్ మోహన్, మాజీ ఎంపీ అశోక్ సిద్దార్థ, గోపినాథ్, నితిన్ సింగ్, పి.ఇడుంబన్, ఎస్పీ నిర్మల్ సహా సినీ దర్శకులు రంజిత్, కదిర్, సోకియా దీనా తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత

వేలూరు, ఆగస్టు 9: జిల్లావ్యాప్తంగా రెండు రోజులుగా భారీవర్షం కురుస్తోంది. దీంతో పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు ప్రవేశించి ప్రజలు ఇబ్బంది లు పడుతున్నారు. అలివేలు మంగాపురంలో ముంపునకు గురైన ప్రాంతాలను సమాజ సేవకుడు, ఐటీ ఉద్యోగి దినేష్ శరవణన్ పరిశీంచి సుమారు వెయ్యి మంది బాధితులకు ఆయన ఆహార పొట్లాలు అందజేశారు.



బాధితులకు ఆహారం అందజేస్తున్న దినేష్ శరవణన్

సంపదను పంచడంలోనే ఆనందం

● మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



సీఆర్‌రెడ్డి జీవిత ప్రస్థానం పుస్తకంతో వెంకయ్య, సీఎంకే రెడ్డి తదితరులు

గూడూరు, ఆగస్టు 9 : మన సంపాదనలో కొంతభాగాన్ని సమాజానికి పంచడంలోనే నిజమైన ఆనందం వుందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. శుక్రవారం గూడూరు డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులు అల్లారెడ్డి శ్యామ్‌సుందర్‌రెడ్డి,డాక్టర్ సీఆర్‌రెడ్డి విగ్రహాలను ఆవిష్కరించారు.అనంతరం డాక్టర్ సీఆర్‌రెడ్డి జీవిత ప్రస్థానం పుస్తకాన్ని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌తో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ గూడూరులో మహిళలు విద్యలో రాణించేందుకు స్నేహితులైన శ్యామ్‌సుందర్‌రెడ్డి, సీఆర్‌రెడ్డి 1980వ సంవత్సరంలో దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలను స్థాపించి ఉన్నత స్థాయికి తీసుకురావడం సంతోషదాయకమన్నారు.ఈ కళాశాల వేలాదిమంది మహిళల జీవితాలకు ఉన్నత బాట చూపిందన్నారు. ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఉన్నతచదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. శ్యామ్‌సుందర్‌రెడ్డి, డాక్టర్ సీఆర్‌రెడ్డి ఆశయాలను కళాశాల యాజమాన్యం ముందుకు తీసుకువెళ్లడం అభినందనీయమన్నారు.అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ సీఎంకే రెడ్డి, డాక్టర్ రోహిణి, డాక్టర్ జనార్దన రెడ్డి, డాక్టర్ మెహర్‌మణి, హనుమంతరావు, బి.సురేంద్ర రెడ్డి, సుధీర్‌రెడ్డి, విద్యాసాగర్‌రావు, రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ సభకు హైకోర్టు అనుమతి

పెరంబూర్, ఆగస్టు 9: విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర మహాసభ కళ్లకుర్చిలో నిర్వహించేందుకు నిబంధనలతో కూడిన అనుమతులను మద్రాసు హైకోర్టు మంజూరుచేసింది. సభలో 400 మంది మాత్రమే పాల్గొనాలనే నిబంధన విధించింది. సభకు పోలీసులు అనుమతి నిరాకరించడాన్ని వ్యతిరేకిస్తూ జిల్లా కార్యదర్శి మీనాక్షి సుందరం మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. చిన్న మైదానంలో 1,000 మంది పాల్గొనడం అసాధ్యమని పోలీసు శాఖ తరపున వివరణ ఇచ్చిన నేపథ్యంలో హైకోర్టు నిబంధనలతో అనుమతులు జారీచేసింది.

చేతితో తీసిన వడలు.. రూ.1.61 లక్షలకు విక్రయం

ఐసిఎఫ్, ఆగస్టు 9: ఆలయ ఉత్సవంలో భాగంగా కాగుతున్న నూనెలో చేయి పెట్టి తీసిన వడలు వేలంలో రూ.1.61 లక్షలకు పలికాయి. తిరువణ్ణామలై జిల్లా కన్నమంగళం తురింజికుప్పం ఆదిపరాశక్తి ఆలయ 24వ వార్షిక ఆడిపూరం ఉత్సవాలు జరిగాయి. ఈ ఉత్సవంలో వేడినూనెలో చేతులతో వడలు తీసి మొక్కులు చెల్లించుకునే కార్యక్రమం జరిగింది. వ్రత దీక్ష ఉన్న ఓ భక్తుడు కాగుతున్న నూనెలో చేయిపెట్టి తీసిన ఏడు వడలను ఆలయ నిర్వాహకులు వేలం వేయగా, రూ.1.61 లక్షలకు ఓ భక్తుడు కొనుగోలు చేశాడు.

కేంద్ర వైద్యులతో సమానంగా వేతనాలివ్వాలి

● డాక్టర్ అన్బుమణి

అడయార్, ఆగస్టు 9: రాష్ట్ర ప్రభుత్వ వైద్యులకు కూడా కేంద్ర ప్రభుత్వ వైద్యులతో సమానంగా వేతనాలు ఇవ్వాలని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి కోరారు. ఈ విషయంపై ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేతనాలు పెంచాలంటూ రాష్ట్ర ప్రభుత్వ వైద్యులు చేస్తున్న డిమాండ్ న్యాయసమ్మతమైందన్నారు. ఏడో వేతన కమిటి సిఫార్సుల మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైద్యులకు మూలవేతనం రూ.56,100గా ఉండాలన్నారు. అయితే, కేంద్ర ప్రభుత్వ వైద్యులు 14 యేళ్ళ సర్వీసు పూర్తి చేసుకుంటే వేతనం రూ.1.23 లక్షలకు చేరుతుందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వ వైద్యులకు మాత్రం 20 యేళ్ళ సర్వీసు పూర్తి చేసుకుంటేనే ఈ వేతనం వస్తుందన్నారు. ఈ వ్యత్యాసాన్ని సవరించి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వైద్యులకు సమానంగా వేతనాలు చెల్లించాలని ఆయన కోరారు.

ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసు.... పాల్ కనకరాజ్ వద్ద విచారణ

అడయార్, ఆగస్టు 9: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసు విచారణలో అనేక ఆశ్చర్యకర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ఇప్పటికే 23 మందిని అరెస్టు చేయగా ఒక నిందితుడు ఎన్‌కౌంటరులో మరణించాడు. ఈ నేపథ్యంలో బీజేపీకి చెందిన కీలక నేత, న్యాయవాది పాల్ కనకరాజ్ పేరు తెరపైకి వచ్చింది. ఈ హత్య కేసులో పోలీసులు శుక్రవారం అతడిని విచారించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కూడా ఉన్న ఈయన.. అనేక కేసుల విచారణకు హాజరవుతుంటారు. బీజేపీలో క్రియాశీలకంగా వ్యవహరించే పాల్ కనకరాజ్ అనేక మంది రౌడీల తరపున కూడా కోర్టుల్లో వాదించారు. ఈ నేపథ్యంలో వ్యాసార్‌పాడికి చెందిన పేరుమోసిన రౌడీ నాగేంద్రన్ పేరు తెరపైకి వచ్చింది. ప్రస్తుతం కడలూరు జైలులో ఉన్న నాగేంద్రన్‌ను ఈ కేసులో పోలీసులు ఏ క్షణమైనా అరెస్టు చేయొచ్చనే ప్రచారం జరుగుతుంది. ఇపుడు పాల్ కనకరాజ్‌ను పోలీసులు విచారణ జరపడం చర్చనీయాంశంగా మారింది.

స్కూల్ కరస్పాండెంట్ అరెస్టు : ఆర్మ్‌స్ట్రాంగ్ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి బెదిరించిన కడలూరు జిల్లాకు చెందిన ఓ ప్రైవేటు స్కూల్ కరస్పాండెంట్ అరుణ్ రాజ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆయన తన పాఠశాలలో పనిచేసే బను డ్రైవర్ సతీష్ పేరుతో ఈ బెదిరింపు ఫోన్ కాల్ చేసినట్టు పోలీసులు విచారణలో తేలింది. దీంతో ఆయనను పోలీసులు అరెస్టు చేశారు.

నాటు బాంబుల నిర్వీర్యం

ఆర్మ్‌స్ట్రాంగ్‌ను హత్య చేసేందుకు సిద్ధం చేసిన ఐదు నాటు బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకుని నిర్వీర్యం చేశారు. కొడుంగయూరులోని ఒక ఇంటిలో ఈ నాటు బాంబులను స్వాధీనం చేసుకున్నారు. వీటిని పోలీసులు కొడుంగయూరు కుప్పైవేడు ప్రాంతానికి తీసుకెళ్ళి నిర్వీర్యం చేశారు.

జాలరి వలలో అమ్మవారి విగ్రహం



పెరంబూర్, ఆగస్టు 9: జాలరి వలలో అమ్మవారి విగ్రహం చిక్కిన ఘటన కడలూరు జిల్లాలో చోటుచేసుకుంది. భువనగిరి వెల్లారు నదిలో అదే ప్రాంతానికి చెందిన జాలర్లు గురువారం చేపలవేటకు వెళ్లారు. జాలరి వేసిన వల లాగే సమయంలో బరువుగా ఉండడంతో చేపలు బాగా చిక్కాయని భావించాడు. కానీ, వల బయటకు తీసి చూడగా అందులో దుర్గా మాత రాతి విగ్రహం కనిపించింది. ఈ విగ్రహాన్ని జాలర్లు తహసీల్దార్ గణపతి, ఆర్ఐ గుహనాధన్, వీఏఓ మణివాసన్‌లకు అప్పగించారు.

టి.నగర్‌లో 170 దుకాణాలకు సీజ్

పెరంబూర్, ఆగస్టు 9: స్థానిక టినగర్‌లో అద్దె చెల్లించని కార్పొరేషన్‌కు చెందిన 170 దుకాణాలకు సీలు వేశారు. పానగల్ పార్క్‌లో 150 దుకాణాలు, పాండి బజార్‌లో 20 దుకాణాలకు అధికారులు సీలు వేశారు. సీలు వేసిన 170 దుకాణ దారులు దాదాపు రూ.3.25 కోట్ల మేర అద్దెచెల్లించాల్సి ఉంది. దుకాణ యజమానులకు పలుమార్లు నోటీసులు ఇచ్చినా బకాయిలు చెల్లించకపోవడంతో సీలు వేసినట్టు కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

వేలూరు, ఆగస్టు 9: గుడియాత్తంలో 10వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా శుక్రవారం వైద్యశిబిరం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే అమ్ములు విజయన్ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే సంక్షేమ సహాయాలు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతి యూనియన్ అధ్యక్షుడు సౌందరరాజన్, యూనియన్ కమిటీ అధ్యక్షుడు సత్యానందం, ప్రభుత్వ వైద్యాధికారి మారన్ బాబు, కౌన్సిలర్లు అర్చన నవీన్, జనరల్ కమిటీ సభ్యులు శక్తిదాసన్, చేనేత శాఖ సభ్యుడు విజయకుమార్, నిర్వాహకులు, వైద్యులు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ శిబిరంలో సుమారు 150 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా ఆడి శుక్రవార వేడుకలు



చెల్లియమ్మన్ అమ్మవారు

వేలూరు, ఆగస్టు 9: జిల్లాలోని అమ్మవారి ఆలయాల్లో ఆడి మాస మూడో శుక్రవార వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో ఆలయాలకు వచ్చి, అంబిళ్లు, పొంగళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక పాలారు ఒడ్డున ఉన్న గ్రామదేవత చెల్లియమ్మన్‌కు శుక్రవారం ఉదయం సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, వెండి కవచం అలంకారం చేశారు.

దుర్గమ్మ ఆలయంలో...

కాట్పాడి రోడ్డులో ఉన్న దుర్గమ్మ ఆలయంలో ఆడి శుక్రవారం సందర్భంగా దుర్గమ్మకు అభిషేకాలు, అలంకరణ, మంగళ హారతి ఇచ్చారు.

రైతులను దూషించిన ఎస్‌ఐ సస్పెన్షన్

ఐసిఎఫ్, ఆగస్టు 9: రైతులను దుర్భాషలాడిన ఎస్‌ఐపై సస్పెన్షన్ వేటుపడింది. దిండుగల్ జిల్లా నిలకోట పూల వ్యాపారులు కొందరు మదురై మాట్టుదావని మార్కెట్లో పూలు కొనుగోలు చేసి మినీ వ్యానులో తిరుగు ప్రయాణమయ్యారు. దిండుగల్ జాతీయ రహదారి చెక్‌పోస్టులో కూడల్‌పుదూర్ ప్రత్యేక ఎస్‌ఐ తవమణి, సరుకుల వ్యానులో మనుషులను ఎక్కించరాదని డ్రైవర్‌ను మందలించాడు. దీనికి సంబంధించి ఎస్‌ఐకు రైతులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఆవేశం చెందిన ఎస్‌ఐ రైతులను దుర్భాషలాడారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో రావడంతో, కమిషనర్ లోకనాథన్ ఎస్‌ఐ తవమణిని సస్పెండ్ చేశారు.

చిట్టీల పేరుతో రూ.1.60 కోట్ల మోసం

● ఇద్దరు టీచర్ల అరెస్ట్

ప్యారీస్, ఆగస్టు 9: ఈరోడ్ జిల్లా గోపిలో వేలం చిట్ పేరుతో రూ.1.60 కోట్ల మోసం చేసిన కేసులో ఇద్దరు టీచర్లను అరెస్ట్ చేసి మరొకరి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గోపి పరిధిలోని నంజప్ప నగర్‌కు చెందిన ఈశ్వరమూర్తి భార్య ప్రభ (60) వన్నాందురై పుదూర్ పంచాయతి ప్రాథమిక పాఠశాల టీచర్‌గా పనిచేసి గత ఏడాది పదవీవిరమణ చేశారు.. కాలిచెట్టిపాళయం పంచాయతి ప్రాథమిక పాఠశాల టీచర్ గ్లోరి (60) కూడా పదవీవిరమణ పొందారు. అవ్వయార్‌పాళయం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న కుడియరసి (55)తో కలసి వీరిద్దరూ వేలం చిట్ నిర్వహించారు. వారి వద్ద కేటీఎస్ నగర్‌కు చెందిన పళనిస్వామి సహా పలువురు చందాదారులుగా చేరి సుమారు రూ.1.50 కోట్లు వరకు చెల్లించారు. చిట్ గడువు పూర్తయిన చందాదారులకు నగదు, వడ్డీ చెల్లించకుండా మోసం చేశారని పళనిస్వామి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు ప్రభ, కుడియరసిలను అరెస్ట్ చేసి, పరారైన గ్లోరి కోసం గాలిస్తున్నారు.

లాడ్జిలో మహిళ హత్య

● ప్రియుడి అరెస్టు

అడయార్, ఆగస్టు 9: స్థానిక ట్రిప్లికేన్‌లోని కలైవాణర్ అరంగం సమీపంలో ఉన్న ఓ లాడ్జిలో మహిళ హత్యకు గురైంది. ఈ కేసులో ఆమె ప్రియుడిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. చూలై అష్టభుజం వీధికి చెందిన జయలక్ష్మి, కార్తీక్ దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. ఈ క్రమంలో పెరంబూరుకు చెందిన రూబెన్ అనే వ్యక్తితో జయలక్ష్మికి ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ క్రమంలో వీరిద్దరూ అపుడపుడూ ట్రిప్లికేన్‌లో ఉండే లాడ్జీలకు వెళ్ళి గడిపేవారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం వీరిద్దరు కలిసి లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నారు. ఈ క్రమంలో వారిమధ్య వ్యభిచార బ్రోకర్ లోన్ సురేష్ వ్యవహారంపై వివాదం జరిగింది. లోన్ సురేష్‌తో ఎందుకు మాట్లాడుతున్నావంటూ జయలక్ష్మిని రూబెన్ ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో రూబెన్ కోపంగా జయలక్ష్మిని బెడ్‌పైకి తోసి గొంతు నులిపి హత్య చేశాడు. ఆ తర్వాత గది నుంచి బయటకు వచ్చిన రూబెన్‌ను లాడ్జి సిబ్బంది పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

మద్రాసు రేస్ క్లబ్‌కు నోటీసు

పెరంబూర్, ఆగస్టు 9: స్థానిక గిండిలోని మద్రాసు రేస్ క్లబ్ నిర్వాహకులకు కార్పొరేషన్ నోటీసులు జారీచేసింది. వర్షపు నీటి విడుదలపై శనివారంలోగా స్పందించాలని రేస్ క్లబ్ యజమాన్యానిన ఆదేశించింది. తక్కువ సామర్థ్యం ఉన్న మున్సిపల్ కాలువల్లోకి వర్షపు నీటిని వదలకూడదు. స్టేడియం లోపల కొత్త చెరువు నిర్మించి వర్షపు నీరు సేకరించాలని నోటీసులో పేర్కొన్నారు. గత మే నెలలో పంపిన నోటీసుకు స్పందన లేకపోవడంతో మళ్లీ నోటీసు పంపారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే ప్రాంగణంలో వర్షపు నీటి నిల్వకు చర్యలు చేపట్టాలని, వర్షపు నీరు రోడ్లు, మున్సిపల్ కాలువల్లో వదిలితే కఠిన చర్యలు చేపడతామని రేస్ క్లబ్ నిర్వాహకులను కార్పొరేషన్ హెచ్చరించింది.

ప్రాణాలు తీసిన 'ఆన్‌లైన్ రమ్మీ'

ఐసిఎఫ్, ఆగస్టు 9: ఆన్‌లైన్ రమ్మీతో డబ్బులు పోగొట్టుకున్న ఓ సంస్థ మేనేజర్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. సాలిగ్రామం దేవరాజ్ నగర్‌కు చెందిన కృష్ణమూర్తి (51)ఓ సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 6వ తేది కార్యాలయానికి వెళ్లిన ఆయన మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చారు. తన కుమారుడు, కుమార్తెకు 'ఇదే నా చివరి రోజు' అంటూ వారి ఫోన్లకు మెసేజ్ పంపారు. వెంటనే ఆయన కుమారుడు దగ్గర ఉన్న బంధువులను ఇంటికి వెళ్లి చూడాలని కోరాడు. వారు వెళ్లి చూడగా ఇంట్లోని గదిలో ఫ్యాన్‌కు కృష్ణమూర్తి ఉరేసుకొని ఉండడం గమనించి దిగ్భ్రాంతి చెందారు. సమాచారం అందుకున్న విరుగంబాక్కం పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. విచారణలో... కృష్ణమూర్తి మూడు నెలలుగా ఆన్‌లైన్ రమ్మీతో సుమారు రూ.15 లక్షలు పోగొట్టుకొని తీవ్ర మనస్తాపంతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిసింది.

ఆన్‌లైన్ జూదాన్ని నిషేధించాలి

● డాక్టర్ రాందాస్ వినతి

అడయార్, ఆగస్టు 9: రోజురోజుకీ పెరిగిపోతున్న ఆన్‌లైన్ జూదంపై ప్రభుత్వం నిషేధం విధించాలని పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ డిమాండ్ చేశారు. ఇదే విషయంపై ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్ జూదం వ్యామోహంలో చిక్కుకుని అనేక మంది అప్పుల ఊబిలో చిక్కుకోవడంతో పాటు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని గుర్తు చేశారు. ఇలాంటి క్రీడను నిషేధించకపోతే ఆత్మహత్యల సంఖ్య మరింతగా పెరిగిపోయే ఆస్కారం ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం నిషేధం విధించాలని ఆయన డిమాండ్ చేశారు.

విల్లుపురం జైలులో ఖైదీ మృతి

ప్యారీస్, ఆగస్టు 9: విల్లుపురం జైలుకు గురువారం తరలించిన ఖైదీ శుక్రవారం ఉదయం హఠాత్తుగా మరణించడంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. విల్లుపురం జీఆర్పీ వీధికి చెందిన నాగముత్తు కుమారుడు అర్పుతరాజ్ (35)ను టాస్మాక్ మద్యం దుకాణంలో జరిగిన ఘర్షణ కేసులో అరెస్ట్ చేసేందుకు పోలీసులు పలు ప్రాంతాల్లో గాలించారు. అతడి జాడ తెలియలేదని విల్లుపురం కోర్టులో పోలీసులు నివేదిక దాఖలుచేశారు. దీంతో న్యాయస్థానం అర్పుతరాజ్‌ను పరారైన ఖైదీగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో, పోలీసులు అర్పుతరాజ్‌ను గురువారం అరెస్ట్ చేసి ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించి కోర్టు ఉత్తర్వులు మేరకు సాయంత్రం 5 గంటలకు సబ్ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం ఉదయం 6 గంటలకు హఠాత్తుగా స్పృహ కోల్పోయిన అర్పుతరాజ్‌ను సమీపంలో ఉన్న ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం తెలిసి మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు. పోలీసులు దాడి వల్లే అర్పుతరాజ్ మరణించాడని, దీనిపై విచారణ జరపాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

అదుపుతప్పి ముందుకు సాగిన రథం

● తొండంతో ఆపిన ఆలయ ఏనుగు



రథాన్ని ఆపుతున్న ఆలయ ఏనుగు ధర్మాంబాల్

పెరంబూర్, ఆగస్టు 9: తంజావూరు జిల్లా తిరువయ్యారులో ధరుమపురం ఆధీనానికి అరం వలర్త నాయకి సమేత అయ్యనార్ ఆలయం ఉంది. ఈ ఆలయంలో ఆడిపూరం ఉత్సవాలు గత నెల 29వ తేది ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. వేడుకల్లో ప్రధానమైన రథోత్సవం గురువారం జరిగింది. ఉత్సవమూర్తులను రథంపై ఆశీనులను చేసి మహిళా భక్తులు తాడు లాగుతూ రథాన్ని మాడవీధుల్లో ఊరేగిస్తున్నారు. హఠాత్తుగా భక్తుల చేతుల నుంచి తాడు కిందపడి పోవడంతో రథం ఒక్కసారిగా ముందుకు కదలడంతో భక్తులు దిగ్భ్రాంతి చెందారు. ఆ సమయంలో ఆలయ ఏనుగు ధర్మాంబాల్ తొండంతో రథం ముందు చక్రం అడ్డుకొని రథాన్ని నిలిపింది. అది చూసిన భక్తులు పెద్దగా చప్పట్లు కొడుతూ, స్వామివారి దివ్యనామస్మరణ చేస్తూ ఆనందంలో మునిగిపోయారు.

ఊరీసు కళాశాలలో 'తమిళ్ పుదల్వన్' పథకం ప్రారంభోత్సవం



విద్యార్థులకు మంజూరు పత్రాలు అందిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఆగస్టు 9: ముఖ్యమంత్రి స్టాలిన్ శుక్రవారం కోయంబత్తూర్ లో 'తమిళ్ పుదల్వన్' పథకం లాంచనంగా ప్రారంభించారు. స్థానిక ఊరీసు కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, అమ్ములు విజయన్, కార్పొరేషన్ మేయర్ సుజాత ఆనందకుమార్, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్, పంచాయతి ప్రతినిధులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

తరుణి



'వ్యవసాయం అన్నది వ్యాపారం కాదు... అది మానవుల జీవన విధానం' అన్నారు వ్యవసాయ శాస్త్రవేత్త నమ్మాళ్వార్. దీన్ని అనుసరిస్తూ తన జీవితాన్ని ప్రకృతితో మమేకం చేసి, ప్రకృతి ప్రసాదించిన 'మునగ చెట్టు' ద్వారా వివిధ వస్తువులు తయారుచేసి విక్రయిస్తున్నారు మదురైకి చెందిన సుజాత. ఆమె 'మిరాకిల్ ట్రీ' పేరిట ఓ సంస్థ ఏర్పాటుచేసి దాని ద్వారా వీటిని విక్రయిస్తున్నారు. ప్రకృతి ప్రేమికురాలిగా, వ్యాపారవేత్తగా ఆమె అందిస్తున్న సేవలను మెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది పురస్కారాన్ని అందించింది. ఆమే నేటి తరుణి.. - ఐసిఎఫ్



'మునగ'తో వ్యాపారం...

- 'మిరాకిల్ ట్రీ'తో రాణిస్తున్న ప్రకృతి ప్రేమికురాలు సుజాత

ప్రకృతితో మమేకం

సుజాత స్వస్థలం తిరుచ్చి. ఆమె భర్తతో కకలిసి మిరాకిల్ ట్రీ అనే సంస్థ నిర్వహిస్తున్నారు. ఆమకు ఉద్యానవనం, కళలపై మక్కువ ఎక్కువ. వారికి తోట కూడా ఉంది. ఈ సంస్థ ప్రారంభానికి ముందే ఆమె తోటలో పలురకాల కూరగాయలు పండించి, వాటిని మార్కెట్లో విక్రయించేవారు. దీంతో ఆమెకు ఉద్యాన కళలపై ఆసక్తి ఏర్పడింది. ప్రకృతి సేద్యం ద్వారా కూరగాయల్లో పోషకవిలువలు ఉంటున్న విషయం గుర్తించి దానినే వృత్తిగా మార్చుకోవాలనే ఆసక్తి ఆ సంస్థకు అంకురార్పణ ఏర్పడింది.

పోషకాల 'మునగ'...

మునగ చెట్టును కొందరు సాధారణమైనదిగా భావిస్తారు. ఈ చెట్టు ఆకులు, కాయలు సులభంగా లభిస్తుండడంతో ప్రజలు దీని గురించి మరెన్నో విషయాలు తెలుసుకోలేకపోతున్నారు.వాస్తవంగా చెప్పాలంటే అదొక 'మిరాకిల్ చెట్టు'. ఈ చెట్టు ఆకులు, కాయలు, బెరడు అన్నింట్లో పోషకాలున్నాయి.దీంతో ఈ చెట్టుతోనే తమ వ్యాపారం ప్రారంభించాలని సుజాత దంపతులు నిర్ణయించుకున్నారు. సాధారణంగా ప్రజలు మునక్కాయలు, ఆకులు మాత్రమే తింటుంటారు. అలా కాకుండా కొత్తరకంగా అందించాలని నిర్ణయించిన సుజాత మొదట పౌడర్‌గా, అనంతరం బాల్ ఆకారంలోనూ ఆకలి పోగొట్టే పదార్థంగా మార్చి విక్రయానికి తీసుకొచ్చారు. ఆమె అందిస్తున్న ఉత్పత్తులు ప్రజాదరణ పొందడంతో విక్రయాలు కూడా పెరిగాయి.





సుజాత సంస్థ తయారు చేస్తున్న ఉత్పత్తులు

ఆకును ఎండలో ఆరబెట్టకూడదు...

మునగ ఆకును ఎండలో ఆరబెట్టరాదు. ఎక్కువ ఎండ ఉంటే అందులోని పోషకాలు ఆవిరవుతాయి. దీంతో సుజాత 'హీట్ పంప్', 'అల్ట్రా లో టెంపరేచర్ డ్రయ్యర్'తో ఈ ఆకును ఎండబెడుతున్నారు. ఈ ఆకుతో పొడులు, తాలింపు తదితరాలు చేసుకోవచ్చు. ఆకును వేడినీళ్లలో ఐదు నిముషాలు వేసి ఉంచితే ఆకు అప్పుడే కోసినట్టు మారుతుంది. ఈ వృత్తి ప్రారంభించిన తొలిరోజుల్లో కష్టంగానే ఉండేది కానీ, నాణ్యమైన ఆహార పదార్థాలు అందజేయాలనే లక్ష్యం మా కష్టాలను అధిగమించిందని సుజాత అంటున్నారు. మునగ ఆకులో ఉన్న 'స్టైరులీనా'ను చిలకడం సాధారణ విషయం కాదు. ఈ పదార్థాల తయారీ కోసం వారు పలురకాల పరిశోధనలు చేపట్టారు. ఇందుకోసం ప్రత్యేక శిక్షణ కూడా తీసుకున్నారు. అనంతరం మొట్టమొదటిసారిగా 2017లో జరిగిన వ్యవసాయ ఎగ్జిబిషన్‌లో సుజాత తమ సంస్థ ద్వారా తయారైన పదార్థాలు పరిచయం చేయగా, విక్రయాలు బాగా జరిగాయి. పొడుల తయారీకి ఎక్కువ ఆకు అవసరమవుతుండడంతో వారి తోటనుంచే కాకుండా రైతుల నుంచి మునగ ఆకు కొనుగోలు చేస్తున్నారు.



సుజాత దంపతులు

మునగ ఆకు, పువ్వులు ఎండించి తేనెలో కలిపి తింటే మహిళలకు ఏర్పడే 'పీసీఓడీ' సమస్య, సంతానలేమి, గర్భకోశ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. మునగ పువ్వు పొడిగాను, క్యాప్సిల్‌గాను ఇస్తున్నారు. విదేశాల్లో ముఖ్యంగా పారిస్‌లో నివసించే తమిళులకు మునగకాయలు దొరికే పరిస్థితి లేదు. అందువల్ల సుజాత మునగ ఆకు ఎండబెట్టి ప్యాకింగ్ చేసి ఇస్తున్నారు.మునగ మాత్రమే కాకుండా వంకాయలు, క్యారెట్, పుదీనా,కరివేపాకు, కొత్తిమీర తదితరాలు కూడా పంపిస్తున్నారు. అలంగానల్లూర్‌లో 10ఎకరాల తోటలో సుమారు 1,000మునగ చెట్లున్నాయి. వీటితో పాటు తాటి, కొబ్బరి, కూరగాయల చెట్లున్నాయి.ప్రస్తుతం మునగతో చేస్తున్నట్లు తాటితో పదార్థాలను తయారు చేస్తున్నారు సుజాత.

ఈ సందర్భంగా ఆమె తరుణితో మాట్లాడుతూ ... భర్త సహకారం, సంస్థలో పనిచేసే ఉద్యోగుల శ్రమ, అంకితభావమే నా విజయానికి కారణమైంది. మా సంస్థలో ఎక్కువ మంది మహిళలు పనిచేస్తున్నారు. 'మేము బాగుండాలి... ప్రజలు క్షేమంగా ఉండాలన్నదే'. మా ముఖ్య ఉద్దేశం అని సుజాత తన మనోభావాలను పంచుకున్నారు.



రాష్ట్ర ప్రభుత్వ పురస్కారం అందుకుంటూ...

మునగతో 50 రకాల వస్తువులు...

తొలుత మునక్కాయతో నూనె తయారుచేశారు. కంటి నరాలకు, అగ్ని గాయాలకు, కాళ్లు, చేతుల నొప్పులకు ఈ నూనె ఉత్తమ నివారణిగా మంచి పరిష్కారం ఇచ్చింది. మునగాకుతో సౌందర్య ఉత్పత్తులు కూడా తయారుచేస్తున్నారు. మునగ చెట్టు బంకను ప్రతిరోజూ రాత్రి పూట పాలల్లో కలిపి తీసుకుంటే దేహం దృఢమవుతుంది. మునగ ఆకుతో టీ, చాక్లెట్, ఎనర్జీ డ్రింక్, స్నాక్స్, ఇలా 50కి పైగా పదార్థాలు తయారుచేసి విక్రయిస్తున్నారు.

తొలి ఫాంటసీ హర్రర్ థ్రిల్లర్ 'అమిగో'

యువ నటి చాందిని తమిళరసన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'అమిగో'. దేశంలోనే తొలిసారి సైబర్ ఫాంటసీ హర్రర్ మూవీగా రూపుదిద్దుకుంది. డెబ్యూ డైరెక్టర్ బి.ప్రవీణ్ దర్శకత్వంలో చాందిని తమిళరసన్, అర్జున్ సోమయాజులు, శ్వేతా రాజేంద్రన్, ప్రవీణ్ ఇలంగో, వత్సన్ చక్రవర్తి, మనీషా జిష్నానీ, భాగ్య తదితరులు నటించారు. 'అయలి' అనే వెబ్ సిరీస్ ఫేం రేవా సంగీతం అందించారు. ప్రత్యగ్రా మోషన్ పిక్చర్స్ బ్యానరుపై బి.గిరిజ నిర్మించారు. ఈ సినిమా గురించి దర్శకుడు ప్రవీణ్ మాట్లాడుతూ, 'ఈ సినిమా భారతదేశంలోనే తొలిసారి సైబర్ ఫాంటసీ హర్రర్ థ్రిల్లర్‌గా తెరకెక్కించాం. భారతీయ చిత్రపరిశ్రమ ఒకసారి వెనక్కి తిరిగి చూసేలా వినూత్నంగా ఉంటుంది. ఆన్‌లైన్ గేమ్‌లో చిక్కుకున్న స్నేహితుల బృందం చుట్టూ తిరుగుతుంది. అమిగో ప్రేక్షకులకు అద్భుతమైన ఫాంటసీ, సైన్స్ ఫిక్షన్ స్టోరీ ఫీచర్ అనుభూతినిస్తుంది. ఆన్‌లైన్ గేమింగ్‌లో కొత్త విషయాలను బహిర్గతం పరిచయం చేస్తుంది. ఇవి ప్రేక్షకులు సైతం బయపడేలా, ఆశ్చర్యపోయేలా చేస్తుంది. భారతీయ చిత్రపరిశ్రమలో ఈ చిత్రానికి ఖచ్చితంగా ఒక గుర్తింపు వస్తుందని భావిస్తున్నాం. ఆన్‌లైన్ ప్రపంచంలో నిత్యం మునిగివుండే ఫ్రెండ్స్ బృందంలోకి గుర్తు తెలియని వ్యక్తి చొరబడి, వారిని ఏ విధంగా ఇబ్బంది పెట్టాడు? వారి జీవితాలను ఎలాంటి ప్రమాదంలోకి నెట్టాడు? ఆ గుర్తు తెలియని నేరగాడి వల నుంచి స్నేహితుల బృందం తప్పించుకుందా? లేదా? అనేది కథాంశంలో ఒక మంచి గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లేతో రూపొందించాం' అని వివరించారు.



'అమిగో'లో ఓ దృశ్యం



అసమానతలపై చర్చ జరగాలి

- నటి పార్వతి

సమాజంలో అసమానతలు ఇంకా ఎందుకున్నాయన్న విషయంపై నిరంతరం చర్చ జరగాలని నటి పార్వతి అభిప్రాయపడ్డారు. ఆమె నటించిన 'తంగలాన్' ఈ నెల 15న విడుదలకానుంది. ఇందులోని తన గంగమ్మ పాత్ర గురించి ఆమె మాట్లాడుతూ.. ఇప్పటివరకు 30కి పైగా చిత్రాల్లో నటించాను. ఒక నటుడికి కరుణ ఉండాలి. సినిమా అనేది సమష్టి కృషి అని గ్రహించాలి. ఇందుకు పెద్ద ఉదాహరణే విక్రమ్. సినిమా వినోదం కావొచ్చు. కానీ, ఇక్కడ ప్రతీది రాజకీయమే. రాజకీయం లేనిదంటూ ఏదీ లేదు. సమాజంలో అసమానతలు ఎందుకు ఉన్నాయో చర్చ జరగాలి. ఈ విషయంలో కొందరికి అసౌకర్యం అనిపించినప్పటికీ అంగీకరించాలి. కళ అంటే రాజకీయం. దానికి సారథ్యం వహించిన సైనిక దళపతి పా.రంజిత్. ఆయన సైన్యంలో ఒక భాగంగా ఉన్నందుకు గర్వపడుతున్నాను' అని పేర్కొన్నారు.

కథే ముఖ్యమంటున్న మలయాళీ భామలు

మలయాళ చిత్రపరిశ్రమకు చెందిన పలువురు యువ హీరోయిన్లు తమిళ చిత్రాల్లో నటించేందుకు ఏమాత్రం వెనుకంజ వేయడం లేదు. హీరో, దర్శకుడు, నిర్మాత, నిర్మాణ సంస్థ, ఆ సినిమాలో నటించే సహ నటీనటులు ఎవరు? ఇలా ఏ ఒక్క అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా, స్టోరీకి అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. ఆ పాత్ర చిన్నదా? పెద్దదా? అనే విషయాన్ని కూడా వారు పట్టించుకోవడం లేదు. ఈ విషయంలో నికిలా విమల్, అన్నా బెన్, రజిషా విజయన్‌లను ప్రధానంగా చెప్పుకోవచ్చు. 'వాళై' చిత్రంలో నటించిన నికిల, 'కొట్టుకాలి' మూవీలో నటించిన అన్నా బెన్ అచ్చం గ్రామీణ మహిళలుగా మారిపోయారు. ఈ సినిమాలు విడుదలైన తర్వాత ఈ ఇద్దరు యువ హీరోయిన్లు తమ పాత్రల్లో జీవించారంటూ ప్రతి ఒక్కరూ ప్రశంసిస్తారని ఆయా చిత్ర యూనిట్ సభ్యులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా తమిళ చిత్రపరిశ్రమలో ఇతర భాషలకు చెందిన హీరోయిన్లు ఆధిపత్యం చెలాయిస్తుంటారు. కోలీవుడ్ దర్శకులు సైతం అందానికి ప్రాధాన్యత ఇవ్వకుండా నటీనటుల ప్రతిభకు పెద్దపీట వేసి హీరోయిన్లను ఎంపిక చేస్తుంటారు. ఆ కోవలోనే మాలీవుడ్‌కు చెందిన యువ కథానాయికలకు దర్శకులు అవకాశాలు ఇస్తున్నారనే టాక్ వినిపిస్తుంది. అలా వచ్చిన అవకాశాన్ని కూడా ఈ యువ హీరోయిన్లు సద్వినియోగం చేసుకుంటూ సినీ రంగంలో స్థిర పడిపోతున్నారు.



'వాళై'లో నికిలా విమల్

చిత్రజ్యోతి

గ్లామర్ డాల్ ఐశ్వర్య రాజేష్!

దక్షిణ భారత చిత్రపరిశ్రమలో ప్రతి ఒక్కరికీ బాగా పరిచయమున్న హీరోయిన్ ఐశ్వర్య రాజేష్. కెరీర్ ఆరంభంలో హోమ్లీ గర్ల్‌గా ముద్ర వేసుకున్న ఈమె.. ఇపుడు గ్లామర్ డోస్ పెంచి ప్రతి ఒక్కరినీ ఆశ్చపరుస్తున్నారు. పా.రంజిత్ దర్శకత్వంలో 2011లో వచ్చిన 'అట్టకత్తి' సినిమాలో ఒక మంచి పాత్ర ద్వారా వెండితెరకు పరిచయమయ్యారు. ఆ తర్వాత 'పుత్తగం' సినిమాలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. 'రమ్మీ' సినిమాలో విజయ్ సేతుపతి సరసన నటించారు. అయితే, 'కాక్కాముట్టై' సినిమా ఆమె సినీ కెరీర్‌కు ఓ టర్నింగ్ పాయింట్‌లా నిలిచింది. ఫలితంగా కోలీవుడ్ సరిహద్దులను దాటి తెలుగు, మలయాళ భాషల్లో కూడా వరుస అవకాశాలను సొంతం చేసుకుంటున్నారు. లేడీ ఓరియంటెడ్ పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. 'ఫర్హానా'లో ఆమె ఒక ముస్లిం గృహిణిగా, ఇద్దరు పిల్లల తల్లిగా పోషించిన పాత్రకు ప్రశంసలు వచ్చాయి. అలాంటి ఐష్.. సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉంటారు. అదేసమయంలో ఇటీవలికాలంలో స్పెషల్ ఫొటో షూట్‌ల పేరుతో ఎక్స్‌పోజ్ చేస్తూ, సోషల్ మీడియాలో ఫొటోలను షేర్ చేస్తున్నారు. దీంతో సినీ ప్రేక్షకులే కాదు ఆమె ఫ్యాన్స్ సైతం ఆశ్చర్యపోతున్నారు.







దేవతామూర్తుల రూపంలో మహిళలు



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

సేలంలో కోలాహలంగా 'వండి' వేడుకలు

పెరంబూర్, ఆగస్టు 9: సేలం కోట మారియమ్మన్ ఆలయ కేంద్రంగా చుట్టుపక్కల గ్రామాల్లో అమ్మవార్లు కొలువుదీరిన ఆలయాల్లో ఆడి ఉత్సవాలు కోలాహలంగా జరుగుతున్నాయి. వాటిలో 'వండి' వేడుకలు ముఖ్యమైనవి. సేలం గుహై మారియమ్మన్ ఆలయం, కాళియమ్మన్ ఆలయం సహా పలు ఆలయాల్లో గురువారం ఈ వేడుకలు జరిగాయి. మహిళలు మాత్రమే దేవతల వేషధారణలో ప్రత్యేక వాహనాలపై విహరించడాన్ని 'వండి వేడుక'గా పిలుస్తుంటారు. విద్యుద్దీపాలతో అలంకరించిన వాహనాల్లో అమ్మవార్ల వేషధారణలో ఉన్న మహిళలు ఆసీనులై పురవీధుల్లో ఊరేగుతారు. అఖిలాండేశ్వరి, ఉలగనాయకి, కామాక్షి, కాలభైరవి, సత్యస్వరూపి, సరస్వతి దేవి, జ్ఞానరూప దేవి, దాక్షాయని దేవి, దుర్గ, భగవతి, పార్వతి దేవి, మీనాక్షి, భద్రకాళి, ఉమా దేవి, గాయత్రి దేవి, పెరియనాయగి సహా దేవతామూర్తుల వేషధారణలో మహిళలు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ వాహనాల ముందు డప్పులు, మేళతాళాలు, గరగాట్టం సహా పలు కళా రూపాలను ప్రదర్శించారు. ఈ వేడుకలు తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మొక్కులు తీరిన మహిళలు దేవతామూర్తుల వేషం ధరించి ఊరేగింపులో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.



వరల్డ్ ట్రైబల్ దినోత్సవం సందర్భంగా చెన్నై ఎగ్మూర్‌లోని మహిళా కళాశాలలో శుక్రవారం ట్రైబల్ జీవన స్థితిగతులపై ఏర్పాటుచేసిన ఫొటో ప్రదర్శనను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

రాష్ట్రంలో ఎస్‌కే80 ఆవిష్కరణ



చెన్నై, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మార్కెట్లోకి కొబెల్కో కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ ఇండియా సంస్థ ఎస్‌కే80 ఎక్స్‌కవేటర్‌ను ప్రవేశపెట్టింది. గురువారం చెన్నైలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ టకేమిచి హిరాకావా దీనిని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భారత పరిశ్రమలో తమ సంస్థ 17 సంవత్సరాల ప్రయాణం సాగించిందని, ఈ సందర్భంగా ఎస్‌కే80 ఎక్స్‌కవేటర్ ఆవిష్కరించడం ముఖ్యమైన మైలురాయని పేర్కొన్నారు. భారతీయ వినియోగదారులకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అధిక నాణ్యతతో అందిస్తున్నట్లు వివరించారు.

సీనియర్ సిటిజన్ల కోసం 'నాన్న నాని హోమ్స్'



బుకింగ్ ఆర్డర్ కాపీ అందజేస్తున్న దృశ్యం

అడయార్, ఆగస్టు 9: కోయంబత్తూరులో సీనియర్ సిటిజన్ల కోసం నిర్మించే అనన్యాస్ నాన్న నాని హోమ్స్ బుకింగ్స్ ప్రారంభించారు. ఈ నగరంలో హోమ్స్‌ను 14 యేళ్ళ క్రితం ప్రారంభించి, విజయవంతంగా నడుస్తున్నాయి. ఇపుడు కొత్తగా తదుపరి దశలో గృహాలు, విల్లా నిర్మించి అప్పగిస్తారు. వీటి బుకింగ్స్‌ను శుక్రవారం నుంచి ప్రారంభించారు. ఇందుకోసం చెన్నై నుంచి కోయంబత్తూరు 'టూర్ ది ప్యారడైజ్' పేరుతో ఒక కార్యక్రమాన్ని చేపట్టింది. 14 యేళ్ళుగా సీనియర్ సిటిజన్ల సేవలో నిమగ్నమైవున్న అనన్యాస్ నాన్న నాని హోమ్స్‌లో ఆనందకరమైన జీవనశైలి అనుభవించడానికి వీలుగా ఈ టూర్ పేరుతో సీనియర్ సిటిజన్లను ఆహ్వానిస్తుంది. ఇందులోభాగంగా చెన్నైలోని ఒక స్టార్ హోటల్‌లో ఈ నెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు బుకింగ్స్ ప్రక్రియ నిర్వహించనున్నారు. ఆసక్తివున్న సీనియర్ సిటిజన్లకు ఉచితంగా ప్రవేశం కల్పించనున్నట్టు అనన్యాస్ నాన్న నాని హోమ్స్ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పట్టణంబాక్కంలో ఆధునిక చేపల మార్కెట్

- 12న ప్రారంభం



పట్టణంబాక్కంలో నిర్మించిన చేపల మార్కెట్

ప్యారీస్, ఆగస్టు 9: స్థానిక మైలాపూర్ సమీపంలోని పట్టణంబాక్కంలో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆధునిక వసతులతో నిర్మించిన చేపల మార్కెట్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ నెల 12న ప్రారంభించనున్నారు. జీసీసీ ఆధ్వర్యంలో పట్టణంబాక్కం లూప్ రోడ్డులో రెండు ఎకరాల్లో రూ.15 కోట్ల వ్యయంతో చేపల వ్యాపారుల కోసం 366 దుకాణాలతో సంత ఏర్పాటైంది. ఇందులో సీసీ కెమెరాలు, మరుగుదొడ్లు, చేపలు శుభ్రపరిచే ప్రాంతం, వాహనాల పార్కింగ్ తదితర వసతులు సమకూర్చారు.

సేలం-ఈరోడ్ మధ్య పడవ రవాణా ప్రారంభం



పెరంబూర్, ఆగస్టు 9: కావేరి నదిలో నీటి ఉధృతి తగ్గుముఖం పట్టడంతో సేలం-ఈరోడ్ జిల్లాల మధ్య పడవ రవాణా ప్రారంభమైంది. సేలం-ఈరోడ్ జిల్లాలు అనుసంధానం చేసేలా, ఎడప్పాడి సమీపం పూలాంపట్టి, ఈరోడ్ నెరింజిపేట ప్రాంతాలు కలుపుతూ ఆనకట్ట నిర్మించారు. ఈ ఆనకట్ట ద్వారా విద్యుదుత్పత్తి జరుగుతోంది. అలాగే, ఈ రెండు జిల్లాల మధ్య ఫైబర్ బోటు రవాణా ద్వారా విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు ఇలా వందలాది మంది ప్రయాణిస్తుంటారు. అలాగే, వారాంతపు సెలవు రోజుల్లో అధిక సంఖ్యలో పర్యాటకులు ఈ బోట్లలో ప్రయాణిస్తుంటారు. ఈ నేపథ్యంలో, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కావేరి నదిలో 1.70 లక్షల ఘనపుటడుగుల నీరు ప్రవహించడంతో, భద్రత కారణాలతో గత నెల 29వ తేది పడవ రవాణా నిలిపివేశారు. దీంతో, ప్రజలు 8 కి.మీ దూరం చుట్టూ తిరిగి వెళుతున్నారు. ఈ నేపథ్యంలో, ప్రస్తుతం కావేరి నదిలో నీటి ప్రవాహం 12,000 ఘనపుటడుగులకు తగ్గడంతో పడవ రవాణాకు అధికారులు అనుమతించారు. దీంతో, శుక్రవారం నుంచి పూలాంపట్టి-నెరింజిపేట మధ్య పడవ రవాణా ప్రారంభమైంది.

పరిశోధనలతో కూడిన విద్య అవసరం



సదస్సులో అతిథులు, నిర్వాహకులు

పెరంబూర్, ఆగస్టు 9: పరిశోధనలతో కూడిన విద్య అభ్యసించాలని పలువురు వక్తలు విద్యార్థులకు సూచించారు. స్థానిక వడపళనిలోని ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫ్యాకల్టీ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఎఫ్ఓఎం) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సదస్సులో సుమారు 400 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఎఫ్ఓఎం డీన్ ప్రొఫెసర్ డా.వి.శశిరేఖ ఆహ్వానం పలికిన ఈ సదస్సుకు నాగా ఫుడ్స్ సీఈఓ లక్ష్మీ విజయానంద్ పాల్గొని, వ్యాపారంలో మెళుకువలు విశదీకరించారు. బార్‌క్లేస్ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ లలిత్ జైన్, బీబీఏ హెచ్ఓడీ డా.జె.రమ్య తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా వ్యాపార రంగాల్లో రాణిస్తున్న పలువురికి అవార్డులు ప్రదానం చేశారు. ఎంబీఏ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా.ఎంఎస్ ప్రభాదేవి వందన సమర్పణతో సదస్సు ముగిసింది.

వైభవంగా ఆండాళ్ తిరుకల్యాణం

ప్యారీస్, ఆగస్టు 9: స్థానిక షావుకారుపేట సమీపంలోని కొండితోపు ముల్లా వీధిలో ఉన్న రంగనాథ స్వామి ఆలయంలో ఆడిపూరం ఉత్సవాల్లో భాగంగా ఆండాళ్ తిరుకల్యాణం వైభవంగా జరిగింది. శుక్రవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో మూలవర్లకు అభిషేకం, అలంకరణ అనంతరం శ్రీనివాస పెరుమాళ్-ఆండాళ్ అమ్మవార్లకు వైభవంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణానికి హాజరైన మహిళలకు పసుపు కుంకుమ, ప్రసాదాలను ఆలయ ధర్మకర్త హరికుమార్ అందజేశారు.



శ్రీనివాస పెరుమాళ్-ఆండాళ్ కల్యాణాన్ని నిర్వహిస్తున్న పురోహితులు



ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల దరఖాస్తు స్వీకరణ ముగియనున్న నేపథ్యంలో, చెన్నై ఓమందూర్ ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న సలహా కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకుంటున్న విద్యార్థులు



కోయంబత్తూర్ భారతీయార్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో రూ.40 కోట్లతో నిర్మించిన ఆరు విభాగాల భవనాలను శుక్రవారం ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, మంత్రులు పొన్ముడి, అన్బిల్ మహేష్, ఏవీ వేలు, ముత్తుస్వామి, గీతాజీవన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా తదితరులు



కోయంబత్తూర్‌లో రూ.481 కోట్లతో ఉక్కం జంక్షన్ నుంచి ఒప్పంకార వీధి వరకు నిర్మించిన ఫ్లై ఓవర్‌ను ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్